క్లుప్తంగా

యూనియన్ బ్యాంకు ద్వారా పొగాకు రైతులకు ఎరువులు

గోపాలపురం: వర్జీనియా పొగాకు రైతులకు యూనియన్ బ్యాంకు ద్వారా ఎరువులు సరఫరాకు ఆ బ్యాంకు అధికారులు అంగీకరించినట్టు పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య అన్నారు. ఈ మేరకే బుధవారం యూనియన్ బ్యాంకు, ఏలూరు శాఖ అధికారులతో చర్చించినట్టు చెప్పారు. పొగాకు రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘం తరపున గుంటూరు పొగాకు బోర్డు అధికారి కె. దామోదర్ బ్యాంకు అధికారులను కోరారన్నారు. చెప్పారు. వర్జీనియా పొగాకు పంట కమిటీ చైర్మన్ పరిమి జగదీష్, గోపాలపురం, కొయ్యలగూడెం రైతు సంఘాల అధ్యక్షులు పిన్నమనేని మధుమోహన్, కాకర్ల వివేకానంద, మోడల్ అధికారి కె ప్రశాంత్ ఉన్నారు.

నాలుగుచోట్ల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



పోతవరం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ప్రాథమిక పాఠశాలల టీచర్లు

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి, పోతవరం, నల్లజర్ల, దూబచర్ల పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతున్నాయి. పోతవరంలో ఇన్చార్జ్ హెచ్ఎం జె.సత్యనారాయణ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఒక్కో రోజు ప్రతి పాఠశాల నుంచి 50 శాతం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇంగ్లిషు, పరిసరాల విజ్ఞానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత జాతీయ విద్యావిధానం–2020 పై వారంతా చర్చించారు. సీఎంఆర్టీ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.నల్లజర్లలో ఇంగ్లిషు, అనంతపల్లి కాంప్లెక్స్‌లో పీఎస్ సబ్జెక్టులపై శిక్షణ కార్యక్రమాలు జరిగాయి.

కొనసాగుతున్న ఓటర్ల జాబితా సర్వే



పడమర చోడవరంలో సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ కిశోర్‌కుమార్

నల్లజర్ల: ఓటర్ల జాబితా సర్వే కార్యక్రమం మండలంలో కొనసాగుతోంది. పడమర చోడవరంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ వి.కిశోర్‌కుమార్ బుధవారం పర్యవేక్షించారు. బీఎల్ఓ (బూత్ లెవెల్ ఆఫీసర్)లతో పోలింగ్ కేంద్రం 158, 162లలోని పలు నివాసాలకు వెళ్లి ఓటర్లను పరిశీలించారు. లేని ఓటర్ల వివరాలు నమోదు చేసుకోవాలని, ఒకే ఇంట్లో ఎక్కువ మంది ఓటర్లు ఉంటే వారందరినీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని సర్వే సిబ్బందికి సూచించారు. మార్పులు, చేర్పులపై తహసీల్దార్ ఆరా తీశారు. మండలంలోని 66 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతున్నట్టు తహసీల్దార్ వెల్లడించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వీఆర్వోలు శామ్యూల్, మధు ఉన్నారు.

దిశ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి

నిడదవోలు రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం బీసీ బాలికల వసతి గృహాన్ని బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. వసతిగృహంలో అమలవుతున్న మెనూను పరిశీలించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో పాటు, దిశ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని, బాలికా విద్యను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే సచివాలయ మహిళా పోలీసులకు నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. ఎస్సై ఎస్‌కే సుభానీ, హాస్టల్ వార్డెన్ పి.సరోజ, ఏఎస్సై పరమహంస పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తాళ్లపూడి: తుపాను ప్రభావంతో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని తహసీల్దార్ టి.రాధిక బుధవారం సూచించారు. పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని, లోతట్టు ప్రాంతాల్లో ఉండరాదని చెప్పారు. విద్యుత్తు స్తంభాల వద్దకు, పాత భవనాల వద్దకు వెళ్లరాదన్నారు.

వీడని ముసురు

- వాయుగుండం ప్రభావంతో రాగల మూడు రోజులూ వర్షాలే
- తాళ్లపూడిలో గరిష్టంగా 84.6 మిల్లీ మీటర్ల నమోదు
- 198 ఎకరాల్లోని పంట నీట మునక



దేవరపల్లి మండలం త్యాజంపూడిలో నీట మునిగిన వరి పైరు

కొవ్వూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో విడవకుండా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం ఎనిమిది గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో సరాసరిన 36.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాయుగుండానికి తోడు నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతుండడంతో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచిస్తోంది. తాళ్లపూడి మండలంలో గరిష్టంగా 84.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మరోవక్క ఈ నెల 23 నుంచి ముసురు పట్టడంతో ఆ ప్రభావం పౌర జీవనంపై పడింది. మంగళవారం రాత్రి నుంచి సన్నపాటి చినుకులు విడవకుండా పడుతూనే ఉన్నాయి. రోడ్ల పక్కనే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవించే చిరు వ్యాపారులు, కాయకష్టం చేసుకుని బతికే కూలీల ఉపాధిపై వర్షం ప్రభావం చూపింది. ఇప్పటికే నాలుగు రోజులుగా వర్షం కురవడం, రాగల మరో మూడు రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉండడంతో నిత్యం రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవులు ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్నారు.

గోపాలపురం నియోజకవర్గంలో 172.9 మిల్లీమీటర్లు

దేవరపల్లి: కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నాలుగు రోజులుగా ఓ మోస్తరు వర్షం నుంచి కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజులుగా సూర్యుడు కనిపించని పరిస్థితి. భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. గ్రావెల్ రోడ్లు బురదమయం అయ్యాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకండా వర్షం పడుతూనే ఉంది. ఈ వర్షానికి నల్లజర్ల మండలంలోని తెలికిచర్ల, చోడవరం గ్రామాల్లోని కూరగాయల పాదులు దెబ్బతిన్నాయి. బీర, బెండ, చిక్కుడు వంటి పాదులకు నష్టం వాటిల్లినట్టు రైతులు తెలిపారు. దేవరపల్లి మండలంలోని త్యాజంపూడి, బందపురం గ్రామాల్లో వరి చేలు నీట మునిగాయి. యర్నగూడెం బస్టాండ్ సెంటర్లో రోడ్డు ధ్వంసం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గోపాలపురం మండలం చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాల వరి పొలాల్లోకి నీరు చేరడంతో ముంపు బారిన పడ్డాయి. మరో రెండు రోజులు వర్షాలు ఇలాగే కొనసాగితే కూరగాయల పంటలు, వరి చేలు తేరుకోవడం కష్టమని రైతులు ఆందోళన చెందుతున్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 172.09 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైయింది.

జనజీవనం అస్తవ్యస్తం

ఉండ్రాజవరం: అల్పపీడనం ప్రభావంతో మండలంలో బుధవారం రోజంతా వర్షం కురుస్తునే ఉంది. దాంతో పౌర జీవనానికి అంతరాయం ఏర్పడింది. వర్షం తెరిపి ఇవ్వక పోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వ్యాపారాల సాగక చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. ఈ వర్షం వరి, వాణిజ్య పంటలకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. నాట్లు వేసిన రైతులు వర్షపు నీరు నిల్వ లేకుండా బయటకు పంపించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీరు

తాళ్లపూడి: రోజుల తరబడి కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లోని రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. దాంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ విడవకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఫలితంగా పలు పల్లపు ప్రాంతాలు ముంపులో చిక్కుకున్నాయి. జనజీవనం స్తంభించింది. బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. తాళ్లపూడి సంత మార్కెట్ వద్ద, ప్రక్కిలంక రోడ్డుపై, వేగేశ్వరపురం రోడ్డు మలుపులో, పంచాయతీ కార్యాలయం సమీపంలో, బల్లిపాడు వద్ద రోడ్డు పైఉన్న గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లోని రోడ్లు ఛిద్రమయ్యాయి. డ్రెయిన్లు లేకపోవడంతో నీరు దిగువకు ప్రవహించకుండా ఇళ్ల వద్దే నిలిచిపోతోంది. అలాగే పల్లపు ప్రాంతాల్లోని వరి చేలు నీట మునిగాయి. పోచవరం వద్ద కొవ్వాడ కాలువలోని భారీగా నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది.

చాగల్లు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు గ్రామాల్లో వరి పొలాల్లోని నీరు చేరింది. మండలంలో బుధవారం 30.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. మండలంలో పేముల కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. నందిగంపాడు, మార్కొండపాడు, ఎస్. ముప్పవరం, ఊనగట్ల, దారవరం,చంద్రవరం తదితర పల్లపు ప్రాంతాల పొలాలో వర్షపు నీరు చేరింది.



గోపాలపురం మండలంలోని వెంకటాయపాలెం-చిట్యాల సమీపంలో నీట మునిగిన వరి పైరు



చాగల్లు మండలం చంద్రవరంలో పేముల కాలువ ప్రవాహ ఉధృతి



తాళ్లపూడిలో ఇళ్ల వద్ద నిలిచిపోయిన వర్షం నీరు

ముంపులో లోతట్టు ప్రాంతాలు

కొవ్వూరు: గోపాలపురం, కొవ్వూరు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని 198 ఎకరాల వరి పంట నీటి మునిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున తాళ్లపూడి, చాగల్లు మండలాల్లోని కొవ్వాడ కాలువ, రాళ్ల మడుగు కాలువ పరీవాహక ప్రాంతాల్లో ముంపు మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే మూడు నుంచి నాలుగు రోజులుగా కొవ్వూరు, గోపాలపురం మండలాల్లో కొన్ని పంట పొలాలు ముంపులో ఉన్నాయి. వరద మరింతగా పెరిగితే కొత్తగా నాటిన వరి మూనలు కుళ్లిపోయే ముప్పు ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 71.79 శాతం ఆయకట్టులో వరినాట్లు పూర్తి చేశారు. నల్లజర్ల, సీతానగరం, కడియం, తాళ్లపూడి మండలాల్లో 75 నుంచి 80 శాతానికి పైగా విస్తీర్ణంలో నాట్లు వేశారు. దీంతో ఈ మండలాల్లో వరి మూన తిరిగింది. వరినారు దుబ్బు కట్టి మూన తిరిగితే ముంపు నుంచి కొంతమేర తట్టుకుంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఇటీవలే కొత్తగా ఊడ్చిన వరి పైరు వారానికి పైగా ముంపులో ఉంటే కుళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. లోతట్టు ప్రాంతాల్లో మినహా మిగిలిన చోట్ల వరి పంటకు ఎలాంటి ఇబ్బంది, నష్టం ఉండదని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



యర్నగూడెంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు

అర్హులందరికీ నూరు శాతం పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- బ్రాహ్మణగూడెంలో లబ్ధిదారులకు 2,051 ధ్రువపత్రాల పంపిణీ

చాగల్లు: అర్హులందరికీ నూరు శాతం సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 99 శాతం మంది అర్హులకు పథకాలు అందుతున్నాయని ఆమె అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మిగిలిన ఒక్క శాతం ప్రజలకు కూడా పథకాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మండలంలోని బ్రాహ్మణగూడెంలో బుధవారం నిర్వహించిన సురక్ష గ్రామ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు వివిధ రకాల 2,051 ధ్రువపత్రాలను మంత్రి వనిత పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉండవల్లి శ్రీనివాస్, సర్పంచ్ గురువెల్లి కుమారి, ఎంపీటీసీ సభ్యులు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉసురుమర్తి జ్యోతి, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మార్కొండపాడులో నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో ఎంపీపీ మట్టా వీరాస్వామి చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష

గోపాలపురం: సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వాదాలకుంట సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 850 మంది అర్జీలు సమర్పించారు. వాటిలో 150 సమస్యలను వెంటనే పరిష్కరించి లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ జొన్నకూటి మనెమ్మ, నాయకులు గద్దే ఈశ్వరరావు, పోతిరెడ్డి నాగరాజు, యండపల్లి కవిత, సర్పంచులు పఠాన్ అన్వర్ బాషా, ఎం శేఖర్‌బాబు, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి పాల్గొన్నారు.

త్యాజంపూడిలో..

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడిలో సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి అధ్యక్షతన సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో 1972 వినతులను పరిష్కరించారు. లబ్ధిదారులకు కులధ్రువీకరణ పత్రాలు 614, ఆదాయ ధ్రువ పత్రాలు 611, 1–బి సర్టిఫికెట్లు 331, కౌలు కార్డులు 19, రేషన్ కార్డులు 36 ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 19584 వినతులు రాగా, 19003 వినతులను పరిష్కరించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు పల్లి రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షులు కూచిపూడి సతీష్, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దూబచర్లలో 1,888 మందికి..

నల్లజర్ల: జగనన్న సురక్ష గ్రామ సభ బుధవారం సాయంత్రం దూబచర్ల గ్రామంలో సర్పంచ్ తాడిగడప బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొత్తం 1,888 మంది లబ్ధిదారులకు ఆయన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చేబ్రోలు బాలాజీ, నాయకులు పంది సత్యనారాయణ, బోడిగడ్ల సుబ్బారావు, నీలపాల రాంబాబు, కనికెళ్ల కెనడీ, దోవ సాయి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం

మండలంలో 24 పంచాయతీలలో జగనన్న సురక్ష గ్రామ సభలను బుధవారంతో దిగ్విజయంగా పూర్తి చేసిన మండల స్థాయి అధికారులను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దూబచర్లలో శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. దాదాపు 12,629 ధ్రువపత్రాలు అందించినట్టు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పూర్తి సహకారం అందించారని ఎమ్మెల్యే అభినందించారు.



చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మంత్రి తానేటి వనిత



గోపాలపురం మండలం వాదాలకుంటలో ధ్రువ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గుండెపోటుతో రైతు మృతి

నల్లజర్ల: మండలంలోని తూర్పుచోడవరానికి చెందిన రైతు, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి శ్రీనివాస్ (48) గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం యథావిధిగా పొలం పనులకు వెళ్లిన ఆయనకు ఛాతీలో నొప్పి వచ్చింది. దాంతో సహచరులు ఆయనను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తూర్పుచోడవరం వెళ్లి శ్రీనివాస్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాస్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇటీవల ఆయన పశువుల కొట్టం అగ్నికి ఆహుతి కావడంతో పాడి పశువులు కాలిపోయాయి. దాదాపు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.



తూర్పు చోడవరంలో మద్దిపాటి శ్రీనివాస్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

- మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ
- అధికారులతో సమీక్ష

నిడదవోలు: జగనన్న లే అవుట్లలో స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ సూచించారు. పట్టణంలో జగనన్న గృహాల నిర్మాణాల పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై బుధవారం ఆయన మున్సిపల్, హౌసింగ్ అధికారులతో సమీక్ష జరిపారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు విధిగా నాణ్యత పాటించాలన్నారు. హౌసింగ్, వార్డు ఎమినిటీస్ కమిటీల సభ్యులు తరచూ జగనన్న లేఅవుట్లలో పర్యటించి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు అధికారుల నుంచి పూర్తి తోడ్పాటు అందేలా చూస్తామన్నారు. అవసరమైన నిర్మాణ సామగ్రిని ఆయా లేఅవుట్‌ల వద్ద ఇప్పటికే అందుబాటులో ఉంచామని చైర్మన్ ఆదినారాయణ చెప్పారు. రూ. 5 కోట్ల వ్యయంతో త్వరలో మంచినీటి ట్యాంక్, పైపు లైను పనులు చేపట్టి తాగునీటిని అందిస్తామన్నారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, హౌసింగ్ డీఈ ఎస్.చంద్రశేఖర్, ఏఈ సీహెచ్ రామ్‌గిరీష్ , మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలపై అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

వర్షంలో తడుస్తూ ఇంటింటికీ..

- సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- సత్యవాడలో గడప గడపకూ..

ఉండ్రాజవరం: నవరత్న పథకాలతో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సత్యవాడ గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వర్షంలో తడుస్తూనే ఆయన ఇంటింటికీ వెళ్ళి పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా గత నాలుగేళ్లల్లో పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్ అందించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మంచి చేయాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. అందులో భాగంగా సంక్షేమ క్యాలెండర్‌ను రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందుకూరి దేవీభార్గవి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ఐవీఎస్ రాజు, నడుంపల్లి శ్రీనివాసరాజు, మరపట్ల నాగరాజు, కోటాల లక్ష్మణ్, కోటాల వంశీ, బి.వెంకటేశ్వర్లు, కాసాని పోతురాజు, బత్తుల సూరి, గ్రామ వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.



సత్యవాడలో వృద్ధుడికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఎమ్మెల్యే పరామర్శ

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ పాలంగి గ్రామ నాయకుడు బసవా ఏసుబాబునాయుడు సోదరి కొప్పిశెట్టి వెంకట నాగసత్యవతి ఇటీవల మృతి చెందారు. బుధవారం పాలంగిలో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పరామర్శించారు. సత్యవతి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోదారి ఉధృతి .. దిక్కుతోచని స్థితి

పెరవలి: వశిష్ఠ గోదావరికి మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. వారం రోజులుగా నిలకడగా ఉన్న వరద మంగళవారం కొంత తగ్గుముఖం పట్టింది. మండలంలోని లంక గ్రామాల రైతులు ఆనంద పడ్డారు. అయితే ఎగువన విస్తారంగా కురుస్తున్న వర్షాలకు బుధవారం నుంచి గోదావరిలో నీటి ప్రవాహం మళ్లీ పెరుగుతోంది. ఫలితంగా మండలంలోని పలు గ్రామాల్లోని లంకల్లోని పంటలు మరింత ముంపునకు గురవుతున్నాయి. ఇప్పటికే కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారి పాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ముక్కామల, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల్లో 800 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.



ముక్కామల వద్ద నీట మునిగిన మునగతోట

బియ్యం కార్డుల పంపిణీ

నిడదవోలు: జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మెరుగైన సంక్షేమ పథకాలు అందుతున్నాయని వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్ అన్నారు. ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడి ఆదేశాల మేరకు పట్టణంలోని 22 వార్డులో బుధవారం కొత్తగా మంజూరైన ఆరు రైస్ కార్డును లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గూడా మురళి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం అందజేత

చాగల్లు: స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు బుధవారం యూనిఫాం అందజేసినట్టు హైస్కూల్ హెచ్‌ఎం పి.వీర్రాజు తెలిపారు. గ్రామానికి చెందిన నాదెండ్ల శ్రీరామ్ తన తల్లి చంద్రకళ జ్ఞాపకార్థం కళాశాలలో 20 మంది విద్యార్థినులకు రెండేసి జతల చొప్పున యూనిఫాం అందజేశారని వీర్రాజు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడు ఏలూరు వాసి

కొవ్వూరు: పట్టణంలోని లక్ష్మీ కేఫ్ సమీపంలో రోడ్డు పక్కనే మంగళవారం లభ్యమైన వ్యక్తి మృతదేహం ఏలూరుకు చెందిన వెలగల త్రివిక్రమరావు (56)దిగా పోలీసులు గుర్తించారు. రెండేళ్ల క్రితం భార్య కరోనాతో మృతి చెందింది. దీంతో ఒంటరిగా ఉంటున్న త్రివిక్రమరావు బయట చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజమహేంద్రవరంలో సోదరుడు ఉండడంతో ఈ ప్రాంతానికి వచ్చాడు. మీడియాలో ప్రచురితమైన ఫొటో ఆధారంగా మృతుడి సోదరుడు రమణ తన సోదరుడిగా గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు.

ఎర్ర కాలువ ఉధృతికి నిలిచిన రాకపోకలు

నిడదవోలు రూరల్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దాంతో నిడదవోలు మండలం కంసాలిపాలెం, తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామాలను కలిపే వంతెన పైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బ్రిడ్జిపైకి నీరు చేరడంతో ప్రయాణికులు వెళ్లకుండా పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు.

ఉధృతంగా కొవ్వాడ కాలువ

తాళ్లపూడి: భారీ వర్షాలకు కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనికితోడు పోచవరంలోని గుండాల చెరువులోకి నీరు చేరడంతో సమీప వరి చేలు పూర్తిగా నీట మునిగాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల నీరు కొవ్వాడ కాలువలోకి నీరు వచ్చి చేరుతోంది. దాంతో రాగోలపల్లి వద్ద గల కల్వర్టుపై నుంచి వరద ప్రవహిస్తోంది. పోచవరం నుంచి తాడిపూడి వైపునకు వెళ్లే కల్వర్టుపైకి కూడా నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. అన్నదేవరపేట వద్ద గల కల్వర్టుపై కూడా నీరు చేరింది.



కంసాలిపాలెం- మాధవరం వంతెన మీద ప్రవహిస్తున్న ఎర్ర కాలువ వరద